క్లుప్తంగా

సత్యసాయి సేవాదళ్ సభ్యులకు శిక్షణ



శిబిరంలో మాట్లాడుతున్న విశ్వనాథ్‌రెడ్డి

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి సేవాదళ్ సభ్యులకు ఎంవీపీ కాలనీలోని ప్రేమసదన్‌లో ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయిబాబా దివ్య అవతార శత జయంతి ఉత్సవాలు–2025 సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సేవాదళ్ సభ్యులకు శిక్షణ శిబిరం జరిగింది. పతాక ఆవిష్కరణ, ఓంకారం, వేదం, నామ సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంస్థ రాష్ట్ర సేవాదళ్ జాయింట్ కో–ఆర్డినేటర్ సి.విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 6 వేల గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వెయ్యి గ్రామాల్లో సేవలు చేయాలని సంకల్పించగా.. ప్రస్తుతం అనేక గ్రామాల్లో జరుగుతున్నాయన్నారు. ఆయా సేవా కార్యక్రమాల్లో సేవాదళ్ సభ్యులంతా భాగస్వాములుగా నిలవాలని కోరారు. పలువురు జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

కూలిన రెస్టారెంట్ బోర్డు



బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై పడిన రెస్టారెంట్ నేమ్ బోర్డు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని ఓ రెస్టారెంట్ నేమ్ బోర్డు ఫుట్‌పాత్‌పై కూలిపోయింది. శనివారం రాత్రి వేళలో ఇది పడిపోవడంతో ఎవరికీ ఇబ్బంది కలగలేదు. ఆదివారం ఉదయాన్నే వాకింగ్‌కి వచ్చిన వారు దీనిని చూశారు. టీయూ 142 యుద్ధవిమాన మ్యూజియం ఎదురుగా ఫుట్‌పాత్‌ను ఆనుకుని రెండు ఇనుప పైపులకు అక్కడి రెస్టారెంట్‌కు చెందిన బోర్డును ఏర్పాటు చేశారు. సముద్ర తీర ప్రాంతం కావడంతో దీనికి బిగించిన ఇనుప బోల్టులు తుప్పుపట్టి ఊడిపోయాయి. దీంతో ఒక్కసారిగా ఈ భారీ బోర్డు ఫుట్‌పాత్‌పై పడిపోయింది. ఇదే ప్రాంతంలో ఉదయం వేళల్లో వందలాది మంది ఫొటోలు తీసుకోవడానికి వస్తుంటారు. ఆ సమయంలో ఇది పడిపోయి ఉంటే ఎవరికైనా ప్రమాదం జరిగేది. నిర్వాహకులు బోర్డుల నిర్వహణను పట్టించుకోవాల్సిన అవసరం ఉంది.

సమతుల ఆహారంతో స్థూలకాయం నియంత్రణ

ఏయూక్యాంపస్: సమతుల ఆహారంతో స్థూలకాయాన్ని నియంత్రించడం సాధ్యపడుతుందని న్యూట్రీషియన్ శీలా కృష్ణమూర్తి అన్నారు. బీచ్ రోడ్డులో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా జాగ్రత్త వహించాలని, కాలిఫోర్నియా బాదం ఆహారంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. స్వీట్లు, స్నాక్స్‌కు ప్రత్యామ్నాయంగా నిత్యం బాదం తినాలన్నారు. ప్రొటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులతోపాటు 15 రకాల పోషకాలు బాదంలో ఉంటాయన్నారు. ఫిట్‌నెస్ కన్సల్టెంట్ రోహిణి పాటిల్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ప్రయోజనాలు అందించే శక్తి కాలిఫోర్నియా బాదంకు ఉందన్నారు.

ఆద్యంతం రసవత్తరంగా 'భక్త ప్రహ్లాద'



శ్రీహరిపై తన భక్తిని చాటుతున్న భక్త ప్రహ్లాదుడు

మురళీనగర్: కేవీ మెమోరియల్ ఆర్ట్స్, విశాఖ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్కు వేములవల్లి కళాక్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఆహ్వాన నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విశాఖ శ్రీ సాయి కళానికేతన్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం వారు రాష్ట్ర ప్రభుత్వంచే బంగారు నంది బహుమతి పొందిన 'భక్త ప్రహ్లాద' పౌరాణిక నాటకం ప్రదర్శించారు. ఆద్యంతం రసవత్తరంగా సాగిన ఈ నాటకం వీక్షించిన ప్రేక్షకులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. ఈ సందర్భంగా నటులను కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

గాల్లో ఆహార భద్రత

నేటి తరం పిల్లలు, యువత ఆరోగ్యం చాలా వేగంగా క్షీణిస్తోంది. ఊబకాయం, క్యాన్సర్, సుగర్ వంటి ఆరోగ్య సమస్యలు నేడు ప్రజలను వెంటాడుతున్నాయి. దీనికి పోటీ ప్రపంచంతో పరుగులు తీయడం ఒక కారణమైతే.. ఆహారం మరో కారణంగా చెప్పవచ్చు. బయట ఆహారం తినేందుకు ఇష్టపడుతున్న ప్రజలు, అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారు. ప్రజలకు మంచి ఆహారం అందుతుందా.. లేదా అని పర్యవేక్షించాల్సిన ప్రభుత్వం ఆహార భద్రతను గాలికి వదిలేసింది. ఆహార భద్రతలో కీలకమైన ఆహార పరీక్షల కేంద్రం రాష్ట్రంలో అందుబాటులో లేకపోవడం ఇందుకు నిదర్శనం.
– బీచ్‌రోడ్డు



శిథిల స్థితికి చేరిన భవనం



పెదవాల్తేరులో నిర్మించిన రాష్ట్ర ఆహార ప్రయోగశాల



రాష్ట్ర విభజన తరువాత స్టేట్ ఫుడ్ ల్యాబరేటరీని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసింది. దీనిని నగరంలోని పెదవాల్తేరు ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ల్యాబ్ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు రూ.30 కోట్లు ఖర్చు చేశాయి. రెండేళ్ల కిందట భవన నిర్మాణం పూర్తయింది. గతేడాది ఫిబ్రవరి 25న ప్రధాని నరేంద్రమోదీ ఏపీతోపాటు ఇతర రాష్ట్రాలకు కేటాయించిన ప్రయోగశాలలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఏడాది కాలం దాటినా నేటికీ ల్యాబ్ సేవలు మాత్రం అందుబాటులోకి రాలేదు. దీనితో భవనం శిథిల స్థితికి చేరుతోంది.

ఆహార భద్రతలో చివరి స్థానం

ఆహార భద్రత సూచికలో రాష్ట్రం 10 ఏళ్లుగా చివరి స్థానంలోనే ఉంది. దేశంలోని ప్రతి రాష్ట్రంలో ఆహార భద్రత పరీక్షల కేంద్రం ఉండగా.. ఒక్క ఏపీ మాత్రమే లేని రాష్ట్రంగా ఉంది. చిన్న చిన్న రాష్ట్రాలకు సైతం సొంత ఆహార పరీక్షల కేంద్రం ఉండగా.. పెద్ద రాష్ట్రమైన ఏపీ మాత్రం తెలంగాణ రాష్ట్రంపై ఆధారపడుతోంది. రాష్ట్రంలో తనిఖీలు చేసిన ఆహారాన్ని పరీక్షల నిమిత్తం తెలంగాణ రాష్ట్రానికి పంపుతున్నారు. దీని వల్ల ఫలితాలు ఆలస్యంగా రావడంతోపాటు వచ్చిన వాటిలో నాణ్యత కూడా సందేహంగా ఉంటోంది.

ఆహార పరీక్షలకు రూ.కోట్ల వ్యయం

జిల్లాల ఆహార, భద్రతా ప్రమాణాల శాఖ అధికారులు తనిఖీల సమయంలో సేకరించిన నమూనాలను హైదరాబాద్‌కు పంపుతున్నారు. దీని వల్ల ఒక్కో నమూనాకు రూ.20 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా నెలకు రాష్ట్ర వ్యాప్తంగా సేకరించిన నమూనాలకు రూ.5 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. నిజానికి రాష్ట్రంలో ఆహార పరీక్షల కేంద్రాలను కావాలనే ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. నమూనాలను ఇతర రాష్ట్రాలకు పంపడం ద్వారా కమీషన్లు వస్తున్నాయని, అందుకే వీటిని పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

కన్నెత్తి చూడని పాలకులు

ప్రధాని మోదీ ఆహార ప్రయోగశాలను ప్రారంభించిన కొద్ది రోజులకే ఎన్నికలు ప్రకటించడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా ఆహార పరీక్షల కేంద్రం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఫుడ్ ల్యాబరేటరీ అందుబాటులోకి రాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజారోగ్య పరిరక్షణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కూటమిలో భాగమైన బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ల్యాబ్ సేవలను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఆహార ప్రయోగశాల సేవలు అందుబాటులోకి రాకపోవడంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనం, అత్యాధునిక పరికరాలు, కెమికల్స్ నిరుపయోగంగా మారాయి. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ఆహార ప్రయోగశాలను తక్షణం అందుబాటులోకి తీసుకురావాలని పలువురు నగరవాసులు కోరుతున్నారు.

రూ.110 కోట్లు కేటాయించిన గత ప్రభుత్వం

ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆహార భద్రత కోసం రూ.110 కోట్లు కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా మూడు ఆహార పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా విశాఖలో రాష్ట్ర ఆహార పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. 2024 ఫిబ్రవరి నాటికి భవనం నిర్మాణం పూర్తి చేయడంతోపాటు సుమారు రూ.10 కోట్ల విలువైన అత్యాధునిక పరికరాలను ఇక్కడ ఏర్పాటు చేశారు.

మూలకు చేరిన పరికరాలు

ల్యాబ్‌లో ఆయిల్స్, ఆహారం, పప్పులు, పాలు, పాల ఆధారిత పదార్థాలు, చాక్లెట్లు, బిస్కెట్లు, సాఫ్ట్ డ్రింక్‌లు వంటి 17 సెక్షన్లకు సంబంధించిన పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన 30 రకాల పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికీ వీటిని పూర్తిస్థాయిలో ఇన్‌స్టాల్ చేయకపోవడంతోపాటు వాటిని వినియోగించేందుకు సంబంధించిన కెమికల్స్ కూడా లేవు. ఇక్కడ పనిచేసేందుకు వివిధ క్యాడర్లకు చెందిన సుమారు 70 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను ఇప్పటి వరకు ప్రారంభించలేదు.



నిరుపయోగంగా మూలన పడి ఉన్న పరికరాలు

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: పైనాపిల్ కాలనీలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, 11 కేవీ పైనాపిల్ కాలనీ, 11 కేవీ దుర్గానగర్, 11 కేవీ అంబేడ్కర్ నగర్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పైనాపిల్ కాలనీ, దారపాలెం, సీవీడీ కార్యాలయం నుంచి రామకృష్ణాపురం, ముడసర్లోవ వరకు ఆరిలోవ కాలనీ నుంచి శ్రీకాంత్‌నగర్, దుర్గాబజార్, నెహ్రూనగర్, టీబీసీ పాయింట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గ్రాడ్యుయేషన్ పట్టా అందుకుంటున్న విద్యార్థి

మద్దిలపాలెం: స్థానిక కృష్ణా కళాశాల రోడ్డులోని స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ మెయిన్ బ్రాంచ్‌లో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 70 మంది యూకేజీ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డ్రెస్‌ల్లో తళుక్కుమన్నారు. అమ్మానాన్న, తాతా, అమ్మమల సమక్షంలో ఉత్సాహంగా ఆడిపాడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు మాట్లాడుతూ 2001లో స్థాపించిన స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ 'బుక్స్ లేవు–హోంవర్క్ లేదు–రాతలు లేవు' అనే వినూత్న విధానంతో కేజీ విద్యకు ఒక కొత్త దిశను చూపిందన్నారు. ఇన్నోవేటివ్ మెథడాలజీకి దేశంలో ప్రథమ స్థానం పొందిన ఘనతను ఈ పాఠశాల సొంతం చేసుకుందని తెలిపారు. చిన్నారులకు ఆనందకరమైన విద్యా వాతావరణాన్ని అందించాలనే పాఠశాల నిబద్ధతకు ప్రతీకగా నిలిచేలా వినూత్నంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించామన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ మళ్ల వాణిశ్రీ మాట్లాడుతూ తల్లిదండ్రులకు పాఠశాల అభివృద్ధికి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందించారు. మళ్ల శర్వాని, యూకేజీ టీచింగ్ టీమ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- ఆరిలోవలో ఆరు పరీక్ష కేంద్రాల ఏర్పాటు



ఆరిలోవ భారతీ స్కూల్ పరీక్ష కేంద్రం బెంచీలపై విద్యార్థుల హాల్ టికెట్ నంబర్లు

ఆరిలోవ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీని కోసం విద్యాశాఖాధికారులు ఆరిలోవ ప్రాంతంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు(కేంద్రం ఏ, బీ), శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఒక సెంటర్‌తోపాటు ఆరిలోవ టీబీసీ పాయింట్ సమీపంలోని భారతీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, విజేత స్కూల్, ఆదర్శనగర్‌లో శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్‌లో కేంద్రాలు సిద్ధం చేశారు. వాటిలో ఆదివారం పరీక్షలకు సంబంధించిన సన్నాహాలు చేపట్టారు. ప్రతి గదిలో విద్యార్థుల హాల్ టికెట్ నంబర్లు వేశారు. పాఠశాలల గేట్ల వద్ద రూం నంబర్లు, హాల్ టికెట్ల నంబర్‌తో కూడిన బోర్డులు సిద్ధం చేశారు. ఆరు కేంద్రాలలో సుమారు 1,200 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. కేంద్రం వద్ద తాగునీరు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచారు.

గురుకులంలో ఓపెన్ పరీక్షల కేంద్రం

శ్రీకృష్ణాపురం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఈ ఏడాది పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షల కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. పబ్లిక్ పరీక్షలతోపాటు సోమవారం నుంచి వీటిని నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రంలో ఓపెన్ పరీక్షలు 84 మంది విద్యార్థులు రాయనున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



ఆరిలోవలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్, అధికారులు

ఆరిలోవ: అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సేవా సమైక్య ఆధ్వర్యంలో 11వ వార్డు ఆరిలోవ అంబేడ్కర్ నగర్ ప్రాథమిక పాఠశాల సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో అతిథులు స్థానిక నాయకులు గాడి సత్యం, ముగడ రాజారావు, సమైక్య సభ్యులు సత్యవరపు రెడ్డియ్య గుప్తా, బుడ్డెపు సన్యాసిరావు, రాంబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం

ఆంధ్ర రాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేసి చిరస్మరణీయుడిగా నిలిచారని అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ అన్నారు. విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పోలీస్ అధికారులతో కలిసి ఆయన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు ఎనలేని కృషి చేశారన్నారు. మహాత్మా గాంధీ సిద్ధాంతాలను అనుసరించారని, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని, హరిజోద్ధరణ కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మధరావు, ఆర్ఎస్ఐ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



స్టీల్‌ప్లాంట్‌కు 'ఊతమివ్వని ప్యాకేజీ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

ఎంవీపీకాలనీ: కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కౌన్సిల్ డిమాండ్ చేసింది. ఎంవీపీ కాలనీ సెక్టార్–5లోని ఐక్యత భవన్‌లో ఆదివారం సీఐటీయూ విశాఖ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ మోదీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటికే దేశంలోని విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, చమురు సంస్థలను వివిధ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టిందన్నారు. అందులో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కూడా ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నారని చెప్పారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించిన రూ.11,445 కోట్లు ప్లాంట్ అభివృద్ధికి, కార్మికుల జీతాల కోసం కాదన్నారు. కేవలం పాత బ్యాంక్ రుణాలు తీర్చడం కోసమే ఈ నిధులు కేటాయించారని పేర్కొన్నారు. కార్మికుల చట్టాలను సైతం మోదీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి, ఏప్రిల్ నుంచి వీటిని అమలు చేయాలని చూస్తోందన్నారు. ఇవి అమలైతే ప్రస్తుతం కార్మికులకు లభిస్తున్న హక్కులన్నీ కోల్పోయే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆయా లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వక్తలు స్టీల్‌ప్లాంట్‌కు 'ఊతమివ్వని ప్యాకేజీ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు కె.ఎం.శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.మణి, ఎస్.జ్యోతీశ్వరరావు, యు.రాజులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను అల్లుకున్న తీగలు



వివేకానందనగర్‌లో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న మొక్కల తీగలు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు వివేకానందనగర్‌లో కొండ అంచున విద్యుత్ స్తంభాలకు పచ్చని తీగలు పొదులగా మారి అల్లేస్తున్నాయి. దీంతో తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతోపాటు పాములు ఇళ్లలోకి చేరుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చి మొక్కల తీగలు విద్యుత్ వైర్లకు కూడా వేలాడుతున్నాయి. అవి ఒకదానితో మరొకటి కలిసిపోయి తరుచూ మంటలు వ్యాపిస్తున్నాయి. వీటిని తొలగించాలని జీవీఎంసీ విద్యుత్ విభాగం సిబ్బందికి, స్థానిక సచివాలయం, పారిశుధ్య సిబ్బందికి పలుమార్లు చెప్పినా.. పట్టించుకోవడం లేదని నివాసులు ఆరోపిస్తున్నారు. వివేకానందనగర్‌లోని ఓ పాఠశాల పక్కన ఉన్న 225ఏ/2/3 విద్యుత్ స్తంభంపై పూర్తిగా అల్లుకున్న పచ్చని చెట్ల కొమ్మలు ముసుగును తలపిస్తున్నాయి.

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు




53 ఏళ్ల తర్వాత ఆత్మీయంగా కలుసుకున్న ఏవీఎన్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఐదు దశాబ్దాల కిందట వారంతా కలసి చదువుకున్నారు. విభిన్న వృత్తుల్లో స్థిరపడి పదవీ విరమణ చేసిన వీరు నేడు కలుసుకున్నారు. మిసెస్ ఏవీఎన్ కళాశాల ఉన్నత పాఠశాలలో 1971–72, 1972–73లో పదో తరగతి చదువుకున్న 35 మంది పూర్వ విద్యార్థులు బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో ఆదివారం కలుసుకుని సందడి చేశారు. తమ చిన్ననాటి స్నేహితులను ఆత్మీయంగా పలకరిస్తూ యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దాదాపు 53 ఏళ్ల అనంతరం వీరంతో కలిసి చిన్నపిల్లలా మారిపోయారు. పాఠశాల రోజులను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు. కె.అప్పలరాజు సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఎస్.సూర్యప్రకాశరావు, ఆచార్య పి.ఎస్.అవధాని, పిళ్లా వెంకటరమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒక ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు.


స్నేహమేరా జీవితం

డాబాగార్డెన్స్: ఆ పాఠశాలలో చదివిన వారంతా ఏడాదికో..రెండేళ్లకో..లేదా ఐదేళ్లకో కలుస్తుంటారు. లేదంటే వాట్సప్‌లో తరచూ విషెష్ చెప్పుకుంటారు. 20 ఏళ్ల కిందట ఆ పాఠశాలలో చదివిన విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. పాతనగరం సీబీఎం ఉన్నత పాఠశాలలో 2005లో పదో తరగతి పూర్తి చేసుకున్న వీరంతా నగరంలోని శివాజీ పార్కు వేదికగా కలిశారు. పాత రోజులు గుర్తుకుతెచ్చుకున్నారు.

ఆధ్యాత్మిక పరిమళం.. రామదాసు సంగీతోత్సవం



రామదాసు కీర్తనలు ఆలపిస్తున్న సత్యనారాయణ బృందం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

ఏయూక్యాంపస్: ఆధ్యాత్మిక పరిమళాన్ని నింపేలా శ్రీ భద్రాచల రామదాసు జయంతి సంగీతోత్సవం సాగింది. బీచ్ రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ శారదా అన్నమయ్య సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో రామదాసు జయంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులను, నగరవాసులు ఆధ్యాత్మిక సంగీత సాగరంలో ఓలలాడించింది. కార్యక్రమాన్ని సాహితీవేత్త సంగీత, విశ్లేషకుడు పారుపల్లి శ్రీరామచంద్రమూర్తి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. రామదాసు తన కీర్తనల్లో శ్రీరామచంద్రుడి విశిష్టతను వివరించిన విధానాన్ని తెలియజేశారు. సాహితీవేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీ శారదా అన్నమయ్య సంగీత విద్యాలయం అందిస్తున్న సంగీత సేవలను వివరించారు. విద్యాలయం సంస్థాపకాచార్యుడు పారుపల్లి సత్యనారాయణ కార్యక్రమ విశిష్టతను వివరించారు. అనంతరం సుందరకాండ గాన పారాయణ చేశారు. పెద్ద సంఖ్యలో సంగీత విద్యార్థులు, నగరవాసులు కలిసి గొంతు కలిపారు. రామదాసు కీర్తనలు, నవరత్న కీర్తనలు ఎంతో హృద్యంగా ఆలాపన చేశారు. మంగళశాసనం, ప్రపాద నివేదనతో కార్యక్రమం ముగిసింది. భారతీయ సంగీతం విశిష్టతను చాటేలా చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎంతో ఉత్సాహంగా పాల్గొని రామదాసు కీర్తలను గానం చేశారు.

బీచ్‌లో కేర్‌ఫుల్



ఆర్.కె. బీచ్‌లో కోతకు గురై ప్రమాదకరంగా మారిన పార్కులో సిమెంటు గట్టుపై పలువురు యువకులు కూర్చుని తీరాన్ని వీక్షిస్తున్నారు. ఏ క్షణమైనా ప్రమాదం జరిగే అవకాశముంది. ఇలాంటి నిర్మాణాలను యుద్ధప్రాతిపాదికన చేపట్టి తీసుకోవలసిన చర్యలపై అధికార యంత్రాంగం తాత్సారం చేయడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.
ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం